నవతెలంగాణ
ఆదిలాబాద్
1
గురువారం | జనవరి 25, 2024 | www.navatelangana.com

బెల్టు షాపులు ఎత్తివేయాలని మహిళల నిరసన

ఆసిఫాబాద్: బెల్ట్ షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వాంకిడి మండలం గోయగాం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోయగాం గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారన్నారు. యువత మద్యానికి బానిసై తరచూ గొడవలకు దిగుతున్నారని, వెంటనే గ్రామంలోని బెల్ట్ షాపులను ఎత్తివేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ జిల్లా అధికారి జ్యోతి కిరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు ఇసురుబాయి, కాంతమ్మ, కమల, సరస్వతి, తానుబాయి, అనసూయ, చంద్రకళలతో పాటు 30 మంది పాల్గొన్నారు.



30న వాహనాల వేలం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 81 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నెలల నుండి ఎవరూ రానందున అన్‌క్లెయిమ్‌డ్ ప్రాపర్టీగా పరిగణించి బెల్లంపల్లి సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఉంచామన్నారు. 6 నెలల కాల వ్యవధి గడువు ముగిసినందున 81 స్క్రాప్ టూ వీలర్స్ వాహనాలను అన్‌క్లెయిమ్‌డ్ స్క్రాప్ ప్రాపర్టీగా పరిగణించి ఈనెల 30న ఉదయం 10 గంటలకు బెల్లంపల్లి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డులు, ఇతర వివరాలు గల పత్రాలు వారి వెంట తీసుకొని రావలన్నారు. పూర్తి సమాచారం కోసం రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ విష్ణు ప్రసాద్ 8712656616, శ్రీనివాస్ 8712656621లను సంప్రదించాలన్నారు.

కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బీసీలు ఉద్యమించాలి



నవతెలంగాణ-హాజీపూర్

బీసీల సామాజిక న్యాయ ఆకాంక్షలని దేశ రాజకీయ ఎజెండాపైకి తీసుకొచ్చిన మహానుభావుడు కర్పూరి ఠాకూర్ అని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కర్పూరి ఠాకూర్ శతజయంతి సందర్భంగా బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1970 దశకంలో రెండు సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కర్పూరి ఠాకూర్ అట్టడుగు మంగలి కులంలో పుట్టి అత్యున్నత స్థానానికి ఎదిగిన బీసీ నాయకుడిగా నిలిచారన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న కర్పూరీ ఠాకూర్‌ని అగ్రవర్ణాలు కుట్రతో పదవీ నుండి దించేశాయన్నారు. బీసీల న్యాయమైన రిజర్వేషన్లు, చట్టసభల్లో వాటా రాజకీయ అంశాలుగా మలిచిన ఘనత కర్పూరి ఠాకూర్‌కే దక్కుతుందన్నారు. సమాజంలో మెజార్టీ వర్గాలైన బీసీల న్యాయమైన హక్కుల విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వివక్షను చూపుతుందని ఆరోపించారు. కర్పూరీ ఠాకూర్ శత జయంతి సందర్భంగా బీసీ జనాభా లెక్కల సేకరణ విషయంలో మోడీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తెలియజేస్తూ జనగణనకు ముందుకు రావాలన్నారు. కర్పూరీ ఠాకూర్ అందించిన పోరాట స్ఫూర్తితో బీసీలు ఉద్యమించి సామాజిక న్యాయాన్ని దక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు పున్నం, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్మృ రాజన్న, వెన్నంపల్లి తిరుపతి, రాజేందర్ పాల్గొన్నారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెన్స్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ప్రతి అర్హుడైన పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి మరోసారి ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి మోహన్ రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ముత్యం రాజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యం సతీష్, మాజీ ఎంపీపీ మత్స్య శంకరయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, ఇసాక్ పసివుల్లా, బాలరాజు, గంగన్న, రాజన్న, దాముఖ కరుణాకర్, తిరుపతి, అల్లం వెంకటరాజ్యం, నందు నాయక్, మామిడిపెల్లి ఇంద్రయ్య, దుమల రమేష్, మౌలానా, రజాక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా, అజ్మత్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ రాజకీయం



నవతెలంగాణ - హాజీపూర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో ఓటు రాజకీయాన్ని చేసి దళితులను విభజిస్తుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కంబాల రాజేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా అనే రాజేష్, ప్రధాన కార్యదర్శిగా సోగాల నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆనే ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా సారంగుల ప్రవీణ్, మేసు రవితేజ, అనే వంశీ, కోశాధికారిగా గొల్ల ప్రమోద్, అధికార ప్రతినిధిగా మేసు ప్రశాంత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా దేవి రాజశేఖర్, కామిల్ల ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా సోగాల శేఖర్, అనే స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి మల్లన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్ట మధుకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తుల పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ విపత్తులు, వాటి వలన ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి విపత్తలు, చేపట్టవలసిన చర్యలపై జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన చర్యలు, బాధితులకు అందించాల్సిన తక్షణ సహాయంపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీపీఆర్ ద్వారా తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరు సీపీఆర్ విధానం తెలుసుకోవాలని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు జరిగిన సందర్భంలో క్షతగాత్రులకు అధిక రక్తస్రావం కాకుండా ప్రాణాలు కాపాడే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వరద ప్రభావిత గ్రామాలు, విద్యా సంస్థలలో ప్రకృతి విపత్తుల అప్రమత్తత చర్యలు, ముందు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విపత్తుల సమయంలో తోడ్పాటును అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఆపదమిత్రలు, గతంలో విపత్తులకు గురైన ప్రాంతాల వివరాలు సేకరించాలన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో అన్ని శాఖల అధికారులు తక్షణమే స్పందిస్తూ అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ఎన్‌డీఆర్ఎఫ్ విజయవాడ 10వ పటాలం ఇన్స్‌పెక్టర్ టీహెచ్ బిటెన్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వి.రాములు, హరికృష్ణ, ఏసీపీ తిరుపతిరెడ్డి, డీఈఓ ఎస్.యాదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరస్తులు శిక్ష నుండి తప్పించుకోకుండా చూడాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేరాలను నియంత్రించేందుకు పరిశోధనలోనూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా ఎస్పీ కె.సురేష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్‌ల అధికారులతో శాంతిభద్రతలపై నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యత, శాస్త్రీయ పరిశోధనలో పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్ణాతులు కావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణ చేపట్టి నేరాల నియంత్రణ, చట్టపరంగా సమగ్ర సాక్ష్యాధారాలతో నేరస్థులకు శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి కారణాలు తెలుసుకుంటు నివారణ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులలో ఉన్న కేసులను రాజీమార్గం దిశగా కృషి చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించిన పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రశంస పత్రాలను అందించారు. ఆసిఫాబాద్ టౌన్, కాగజ్‌నగర్, కౌటల సీఐలు రాజు, బుద్దేస్వామి, సాదిక్ పాషా, ఆసిఫాబాద్, సిర్పూర్(టి), రెబ్బెన, వాంకిడి ఎస్సైలు ప్రవీణ్, ధీకొండ రమేష్, చంద్రశేఖర్, సాగర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్-టి హెడ్ కానిస్టేబుళ్ల బాపూరావు, సత్యనారాయణ, అజీముద్దీన్, కానిస్టేబుళ్లు పూల్ సింగ్, ఉమేష్, నజాత్ ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర రావు, కాగజ్‌నగర్ డీఎస్పీకరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేష్, టాస్క్ ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసులు హక్కుల కోసం భీం స్ఫూర్తితో ఉద్యమించాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-బెజ్జూరు

ఆదివాసులు హక్కుల సాధన కోసం కుమురం భీం స్ఫూర్తితో ఉద్యమించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో కుమురం భీం విగ్రహా విష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రణాళిక ప్రకారంగా ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి కోసం ముందుకెళ్తామని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాలకు మౌళిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. గత ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో చర్చించామని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గానికి జాతీయ రహదారి మంజూరైందని, దీనిద్వారా ఐదు మండలాలకు అభివృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. అటవీ శాఖ అనుమతులు లేక ఆగిపోయిన రోడ్లను పూర్తిచేసి ఆ గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ ఐక్యతతో హక్కులు సాధించాలన్నారు. ఆదివాసీ గూడాల్లో అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, జెడ్పీ నిధులను వెచ్చించి రోడ్డు లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. అంతకుముందు కుమురం భీం విగ్రహాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావు ఆవిష్కరించారు. బస్టాండు ప్రాంతంలో మరగుదొడ్డి నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఆదివాసుల ఆధ్వర్యంలో బెజ్జూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన కళాజాత ప్రదర్శన పలువురిని ఆకర్షించింది. ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థులు వారి వేషాదారణలో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత బిక్షమయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కుమురం మాంతయ్య, మాజీ జెడ్పీ చైర్మెన్ సిడాం మారుతి, ఆదివాసీ నాయకులు సోయం చిన్నయ్య, తిరుపతి, సకారాం, హన్మంతు, బీజేపీ నాయకులు పాల్వాయి శ్రావణ్, బాలకృష్ణ, తాళ్ల రామయ్య, సంతోష్, బీఆర్ఎస్ నాయకులు బశరత్‌ఖాన్, దోకె వెంకన్న, పుల్లూరి సతీష్, తంగెడిపెల్లి మహేష్, జావిద్ అలీ పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించిన సభ్యులు



నవతెలంగాణ-జైపూర్

గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావస్తుండటంతో బుధవారం రామారావుపేట్ గ్రామపంచాయతీ సభ్యులు సన్మాన సభ ఏర్పాటు చేసుకున్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యుల పరస్పర సహకారం ఎంతగానో దోహదపడిందని గుర్తు చేసుకున్నారు. పండుగ వాతావరణంలో జరుపుకున్న సన్మాన సభలో సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి దంపతులను వార్డు సభ్యులు శాలువాలతో సన్మానించగా వార్డు సభ్యులను సర్పంచ్ దంపతులు సన్మానించారు. ఈ సంధర్భంగా ఒకరికొకరు పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పది వార్షిక పరీక్షలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నతమైన ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి మండల విద్యాధికారులు, ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉన్నతమైన ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అధికారుల సమిష్టి కృషితో గత సంవత్సరం 10వ తరగతి వార్షిక ఫలితాలలో 76 శాతంతో రాష్ట్రంలో 4వ స్థానంలో నిలవడం అభినందనీయమని, ఈ సంవత్సరం మరింత కృషి చేసి మంచి స్థానాన్ని సాధించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యాచరణ ప్రకారంగా విషయాలను చదువుకునే విధంగా నాణ్యమైన విద్యా బోధన అందించాలని, ఇప్పటి వరకు సిలబస్ పూర్తి చేయడం జరిగిందని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, గైర్హాజరు అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు తరగతులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఆర్సీఓ గంగాధర్, పరీక్షల సహాయ కమీషనర్ ఉదయ్‌బాబు, జెండర్ కమ్యూనిటి కోఆర్డినటర్ రాథోడ్ సుబాష్, జిల్లా సైన్స్ అధికారి కోఆర్డినేటర్ కటకం మధుకర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్, క్వాలిటి కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ సింగరేణియన్‌గా సురేష్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణిలో 36 సంవత్సరాలుగా సేవలందిస్తున్న జీఎం (కోఆర్డినేషన్) జీ.సురేష్ ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికయ్యారు. 1987 సంవత్సరంలో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీగా సంస్థలో చేరిన ఆయన 36 సంవత్సరాల్లో 34 సంవత్సరాలు బొగ్గు గనుల్లో ఉత్పత్తి విభాగంలో పని చేశారు. ములుగు జిల్లా జంగాపల్లిలో జన్మించిన ఆయన సింగరేణి సంస్థ ఉద్యోగంలో చేరి సంస్థకు అందించిన అత్యుత్తమ సేవలను గుర్తించిన యాజమాన్యం ఈ ఏడాది ఉత్తమ సింగరేణియన్‌గా ఆయనను గౌరవించనుంది. రిపబ్లిక్ డే సంధర్భంగా జీఎం (కోఆర్డినేషన్) సురేష్‌ను కొత్తగూడెంలో సీఎండీ బలరామ్ నాయక్ సన్మానించడంతో పాటు అవార్డును అందజేయనున్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి వ్యాప్తంగా ఏరియాకు ఒకరి చొప్పున ఉత్తమ అధికారిగా అన్ని ఏరియాల్లో కలిపి అత్యుత్తమ అధికారుల్లో ఒకరిని ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక చేసి సన్మానించుకోవడం ఆనవాయితీగా సంస్థ జరుపుకుంటుంది. ఈ క్రమంలో ఈ ఏడాదిలో ప్రతిష్టాత్మక పురస్కారానికి జీఎం సురేష్ పేరును అవార్డుకు కమిటీ సిఫారస్ చేయడంతో 36 సంవత్సరాల్లో ఆయన సంస్థకు అందించిన విశిష్ట సేవలను సమర్థ నాయకత్వ పటిమను గుర్తించి ఈ అవార్డును అందజేయనున్నారు. మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీగా సంస్థలో చేరిన సురేష్ ప్రస్తుతం జీఎం (కోఆర్డినేషన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా, సింగరేణి సేవా సమితి వైస్ ప్రసిడెంట్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్‌గా ఆయన పని చేసిన ఇల్లందు, రామగుండం-2 శ్రీరాంపూర్ ఏరియాలో లక్ష్యాలను సాధించారు. రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి పని చేసిన నేపథ్యంలో కేకే-5 గని మేనేజర్‌గా, కోయగూడెం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఆయన భారత రాష్ట్రపతి చేతుల మీదుగా రెండు సార్లు నేషనల్ సేఫ్టీ అవార్డు అందుకున్నారు. అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఏరియా స్థాయిలో గతేడాది ఆగస్టు 15న సీఎండీ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా కూడా అవార్డు అందుకున్నారు.

బాలిక దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు



నవతెలంగాణ-తాండూర్

బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని రేచీని మాదారం పాఠశాలలో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి , రేచిని పీఈటీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో బాలికలు అన్ని హక్కులు పొందే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కుటుంబ వ్యవహారాల్లో బాలికలను చిన్నచూపు చూడవద్దని సూచించారు. తల్లిదండ్రులు ఆడమగ వ్యత్యాసాలను విడనాడి బాలిక సంరక్షణకు తోడ్పాటునందించాలన్నారు. నేటి బాలికలే రేపటి మాతృమూర్తులన్న విషయాన్ని మరువద్దన్నారు. ప్రభుత్వం బాలికల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని, ఉచిత విద్యతో పాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తుందన్నారు. అన్ని రంగాల్లో రిజర్వేషన్ సౌకర్యాలు కల్పిస్తున్న విషయాలను తెలియజేశారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జనవరి 25, 2024 | www.navatelangana.com

గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ

నవతెలంగాణ-కడెం



మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో డీపీఓ శ్రీలత బుధవారం పర్యటించారు. గ్రామపంచాయతీకి సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, గ్రామసభ రికార్డు, జనన, మరణ రికార్డు, ఇంటిపన్నుల రికార్డు, క్యాష్ బుక్ తదితర రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, కార్యదర్శి రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్స్‌కి రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ రూల్స్‌పైన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. తాగినడిపి ప్రమాదాలకు కారణమైనట్లయితే కేసులు నమోదు చేసి, జైలుకి పంపడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు ఆటోలో ప్రయాణించినచో సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బేల

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ గంగుల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జయకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ, ఎమ్మార్సీ సిబ్బందిని, రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గజానన్ కార్యదర్శులు నదీం అర్షద్, నరేశ్, అడిట్ కమిటీ కన్వీనర్ భీం దర్శన్, సోషల్ మీడియా కన్వీనర్ సుగుణాకర్, పత్రిక కమిటీ కన్వీనర్ విఠొభా, జిల్లా నాయకులు జగదీష్, సదానందం, జయప్రకాశ్, దేవదాస్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాకు స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అచ్చి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారికి జాబ్ ఆఫర్‌ను అభ్యర్థులకు తెలియజేశారు. పలువురు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ జాబ్ మేళలో దాదాపు 128 మంది నిరుద్యోగులు ఎంపిక కాగా వారికి కళాశాల ప్రిన్సిపల్ డా.జలగం అనిత జాబ్ లేటర్ ను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ డిగ్రీ అనంతరం జాబ్ రావడం సంతోషంగా భావించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగమే కాకుండా తమ వద్ద ఉన్న టాలెంట్‌తో అనేక ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. ప్రయివేట్ రంగంలో ఉద్యోగం చేస్తూనే అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధం కావాలని సూచించారు. ఇలాంటి జాబ్ మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. మామడ మండలం ఆదర్శనగర్ గ్రామసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, కొరటికల్ గ్రామ ఎంపీటీసీ సౌజన్య రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగారెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శ్రీహరిరావు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కనబడకుండా పోతుందని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పిన ఆ పార్టీ నాయకుల్లో మార్పు రాలేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేస్తామని తెలిపారు.

అడ్మిషన్లపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఉట్నూర్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లపై కళాశాల యాజమాన్యం బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, లాల్‌టెకిడి జూనియర్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.స్వామి, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సంగీత మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ముగియనున్నందున విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. ప్రయివేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా బోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు బాలబాలికలకు వేరు వేరుగా ప్రత్యేక వసతి గృహాలు సైతం ఉన్నాయని తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థులను చదువుతో పాటుగా ఆట పాటల్లో రాణించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం నుంచి కళాశాలలో ఎన్‌సీసీ రావడం జరిగిందన్నారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రావణి, శ్రీధర దేవి, రవికిరణ్, రవీందర్, రాజశేఖర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్, తిరుపతి, ప్రవీణ్, శంకర్, దేవన్న, సుధాకర్, జావిద్, సుధాకర్, నసీర్, కార్తిక్, రాజు, నవీన్, శ్వేతా, జోహరా ఫాతీమా, దినేష్, హంసరాజ్ తదితరులు ఉన్నారు.

నేటి బాలలే రేపటి శాస్త్రజ్ఞులు

- సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అదనపు కలెక్టర్
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన
- విద్యార్థులకు బహుమతుల ప్రధానం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి బాలలే రేపటి శాస్త్రజ్ఞులని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీ విద్యాలయంలో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 19 నుంచి జిల్లాస్థాయి 51వ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన మేళాను ఆన్లైన్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దాదారు 160 ప్రదర్శనలు వచ్చాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలదేవి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులు తయారు చేసిన ఇన్నోవేషన్లను ఆన్లైన్ ద్వారా ఎమ్మెల్యే వీక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్, బహుమతులను ప్రధానం చేసి అభినందించారు. అలాగే ఎమ్మెల్యేను, అదనపు కలెక్టర్ ను విద్యాశాఖ అధికారి శాలువాతో సత్కరించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఆ నైపుణ్యాన్ని గుర్తించి ఉన్నత స్థానాలకు ఎదిగేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ నిర్వచించే కార్యక్రమానికి ప్రభుత్వం ఫండ్స్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మరోసారి ఏ అవసరం ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. సొంతంగా అయిన ఖర్చు చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులు జిల్లా స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ విద్యార్థులు ఆ దిశగా అప్‌డేట్ కావాలని అన్నారు. సమాజంలో చదువు ఎంతో ముఖ్యమని, చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు.

సైన్స్ టెక్నాలజీ చాలా ముఖ్యం...

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ ప్రతిసారి వచ్చే ఫలితాల్లో బాలికలదే పైచేయి అన్నట్టుగా ఈసారి కూడా ఫలితాల్లో బాలికలదే పైచేయి అన్న విధంగా కృషి చేయాలన్నారు. సమాజంలో విద్య అనేది కచ్చితంగా ఉండాలని దానితో పాటు సైన్స్ టెక్నాలజీ ఉండాలన్నారు. తాము చదువుకునేటప్పుడు ఫోన్‌లు ఉండేవి కావన్నారు. నేడు ఫోన్ అనేది ప్రతి ఒక్కరి దగ్గర ఉంటుందన్నారు. టెక్నాలజీ దిన దినం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇటీవల సైంటిస్టులు చంద్రాయన్ ప్రయోగం చేపట్టారని అగ్రదేశాలతో మన దేశం పోటీ పడుతుందని అన్నారు. రాబోయే 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ దీప్తి, డీడబ్ల్యూఓ మిల్కా, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ఎంఈఓ జయశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది బీజేపీ నాయకులు ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-బేల

రైతులు గ్రామాలలో దళారులకు కందులు విక్రయించకుండా ప్రభుత్వాల ద్వారా కొనుగోలు చేస్తున్న కేంద్రాలలోనే కందులు అమ్మి మంచి ధరను పొందాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో బేల, డోప్టాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకానికి పూజలు చేసి, రిబ్బన్ కట్ చేసి కందులను తూకం చేశారు. ఈ సందర్భంగా మొదట రైతును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని, బహిరంగ మార్కెట్‌లో కందులకు మంచి ధర పలకడంతో ధరలు స్థిరికరణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జిల్లాల్లో 50వేల క్వింటాళ్ల కందులను కొనుగోలు చేయాలని నిర్ణయించడం జరిగిందని, ప్రతి రోజు అధికారులు ఈ ధరలను తెలియజేస్తారని అన్నారు. రైతులందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించి మంచి ధరను పొందాలని అన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం.ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ మార్కెట్ ధరలలో హెచ్చు, తగ్గుల ప్రకారం రెట్‌లు నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. 10గంటలలోపు కొనుగోలు కేంద్రాలకు తెలియజేస్తూ, ఆ రోజు ఆ ధరల ప్రకారం కొనుగోలు చేస్తామని రైతులకు వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం.ప్రవీణ్ రెడ్డి, డీసీఓ మోహన్, పీఏసీఎస్ డోప్టాల చైర్మెన్ జితేందర్, మార్కెట్ కార్యదర్శి కాంబ్లె మధుకర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, నాయకులు దత్త నిక్కం, మురళీధర్ రాక్రే, రూపేష్‌రెడ్డి, రాకేష్, ప్రదీప్ ఖోడే పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకం : ఆర్టీసీ ఆర్ఎం

- బస్టాండ్‌లో డ్రైవర్స్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎం, డీఎం, ఉద్యోగులు, విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని, వారితోనే సంస్థ మనుగడ ఉందని ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం డ్రైవర్స్ డేను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో వేడుకలను నిర్వహించారు. డ్రైవర్లకు గులాబి పువ్వులు అందించి వారిసేవలను కొనియాడారు. విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు.

ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లే ప్రధాన మూలం

ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లే ప్రధాన మూలమని వెన్నెముక అని అన్నారు. ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్న కారణంగా నేడు సంస్థకు పేరు వచ్చిందన్నారు. యజమాని లేకపోయిన వారే యాజమనులుగా మారి సంస్థను లాభాలవైపు తీసుకెళ్తున్నారని అన్నారు. అలాంటి వారి సేవలు గొప్పవని కొనియాడారు. ప్రతి వాహనంకు డ్రైవర్ కచ్చితంగా అవసరమని డ్రైవర్ లేకుంటే ప్రయాణాలు పనులు కావన్నారు. బస్సులోని సీట్లను ప్రయాణికులతో నింపి సంస్థకు ఆదాయం అర్జిస్తూ, ఇంధనం పొదుపు చేసి, సంస్థ గౌరవ ప్రతిష్టను పెంపొంధింపజేసేవరన్నారు. విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రమాదాలను సున్న శాతానికి తేవడానికి కృషి చేసేవారని అన్నారు. సమయపాలన, ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తున్నారని అభినందించారు. అనంతరం డ్రైవర్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆర్ఎం బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం ప్రవీణ్, డీఎం కల్పన, ఆర్టీసీ సిబ్బంది డ్రైవర్‌లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మెస్రం వంశీయుల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నార్నూర్

నాగోబా జాతర సందర్భంగా గంగాజలానికి పయనమౌతున్న మెస్రం వంశీయులు ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మరపగూడ దేవారిగూడకు కాలినడకతో చేరుకొని అక్కడ పూజలు చేశారు. అనంతరం జంగుబాయి ఇంటిలో భోజనం చేసి, అక్కడి నుంచి గౌరీ పయనమయ్యారు. ఇందులో మెస్రం వంశీయులు, పెద్దలు, మెస్రం తిరుపతి గ్రామపెద్దలు ఉన్నారు.



స్పీకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బుధవారం మండల నాయకులు, సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, అడ్వాల రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్ ఆరోగ్యం గురించి, అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో మరింత క్రియాశీలంగా పని చేయాలని ఆకాంక్షించారు.

బాలికలకు విద్యా విజ్ఞానం ఎంతో అవసరం



నవతెలంగాణ-తాంసి

బాలబాలికలకు విద్యతో పాటు విజ్ఞానం ఎంతో అవసరమని ప్రొఫెసర్ విజయ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు అవసరమైన విద్యా విజ్ఞానంతో పాటు బాలికలకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమ్మాయి విజ్ఞానం, విద్యతో సాధికారత పొందుతారని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం అంతులేని అవకాశాలను అన్‌లాక్ చేయాలని అన్నారు. బాలికలు తమ బంగారు భవిష్యత్తు కోసం చదువుపై మాత్రమే శ్రద్ధ చూపాలన్నారు. కెరీయర్ గైడెన్స్ పైన అవగాహన కలిగిఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామసర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఎంఈఓ శ్రీకాంత్, సఖి కేంద్రం సభ్యులు సరస్వతి, షీటీం ఇన్‌చార్జీ సుశీల, అమన్ ఫౌండేషన్ సభ్యులు, ఏహెచ్ఎస్ బాయ్స్, తాంసి ఎస్ఓ అరుణ, కేజీబీవీ ఉపాధ్యాయులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ తులసీరాం, మహిత సభ్యులు పాల్గొన్నారు.

కీర్తన డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

నవతెలంగాణ-బేల



మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడుగా పని చేస్తున్న గెడం ప్రవీణ్‌కి ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ మాయదేవి పర్యవేక్షణలో "ఎక్కీస్ సాదికే హిందీ ఉపన్యాస్ మే ఆదివాసీ జన్ జీవన్"అనే అంశంపై పరిశోధన చేశారు..గెడం ప్రవీణ్ బేల మండలంలోని కామ్‌గార్‌పూర్ గ్రామానికి చెందిన వారు. బాల్యం నుంచి ప్రభుత్వ ఆశ్రమ హాస్టల్, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పీజీ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి చేశారు. ఇటీవలే నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధించిన ఆయన నిన్న ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ సాధించారు. ఈ సందర్భంగా కీర్తన డిగ్రీ కాలేజ్ చైర్మెన్ పవన్ కుమార్ అగర్వాల్ ప్రిన్సిపాల్ డా వరప్రసాద్‌రావు, ప్రవీణ్‌ని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 26న ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఈనెల 26న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నిరసన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో బీజేపీ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. కార్మికులకు ఉన్న అనుకూల చట్టాలను రద్దు చేసిందని ఆరోపించారు. రైతుల సమ్మె కారణంగా మూడు నల్ల బిల్లులను వెనక్కి తీసుకున్న కేంద్రం మరోసారి దాన్ని అమలు చేసే యత్నం చేస్తుందన్నారు. కార్మిక, కార్షకులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకువస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకులు మునిగెల నర్సింగ్, దేవిదాస్, జగన్‌సింగ్, కుంటాల రాములు, గజేంగుల రాజు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు, జువాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ సబ్జెక్టులకై అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 25 నుంచి 31 వరకు కళాశాలలో దరఖాస్తుతో పాటు జిరాక్స్ సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి మొదటి వారంలో డెమో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో ఫస్ట్‌క్లాస్ లేదా నెట్ సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి బోధన అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9849390495 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
నమస్త తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | జనవరి 25, 2024 | www.navatelangana.com

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ

నవతెలంగాణ- కాగజ్‌నగర్ రూరల్



కాగజ్‌నగర్ పట్టణంలోని పలు హోటళ్లలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మున్నిబార్ అండ్ రెస్టారెంట్, కాకతీయ మెస్, మున్నీ హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ హోటళ్లలో సదరు యజమానులు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్నట్లు తేలింది. మూడు హోటళ్లలో 18 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని హోటల్ యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్యాంలాల్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఆంబ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

నవతెలంగాణ- తాండూర్



తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాండూర్ వాల్మీకి నగర్‌కు చెందిన అబ్బర్ల రాజ్‌కుమార్ (20) బుధవారం సాయంత్రం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు మృతుని తల్లి దేవక్క, నాలుగు సంవత్సరాలు క్రితం మరణించిందని, అదేవిధంగా మృతుని తండ్రి తొమ్మిది నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అప్పటినుండి రాజ్‌కుమార్ ఒంటరితనంతో మానసికంగా కుంగిపోయి తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుని నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నవ తెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి సూచించారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల వాల్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ విభాగాల సమన్వయంతో పాటు ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 15 నుండి వచ్చే నెల ఫిబ్రవరి 14న నిర్వహించే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల్లో మరణించిన వ్యక్తుల కుటుంబాలు రోడ్డున పడటంతో పాటు వారి కుటుంబ సభ్యుల జీవితాలు ఛిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రజలు సైతం భాగస్వాములు కావాలన్నారు. వాహనదారులు సరైన డాక్యుమెంట్స్ కలిగి ఉండి వాహనాన్ని డ్రైవ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర రావు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, సంతోష్ కుమార్, డీఎస్పీలు కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ- కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం - 327 ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను బుధవారం కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో డీఈ నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఎమ్మాజీ సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డివిజనల్ అధ్యక్షులు రయిస్, ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ నాయకులు శ్రీరాములు, స్వామి, ముజీబ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-కౌటాల

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. కాలం చెల్లిన మందులను రైతులకు విక్రయించవద్దన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించి, నాణ్యత లేని వాటిని రైతులకు ఇచ్చిన చర్యలు తప్పవన్నారు. రైతులు కూడా రసీదు తప్పని సరిగా తీసుకోవాలని కోరారు. రైతులను మోసం చేసేల వ్యవహరిస్తే షాపులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ ఉన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం



నవతెలంగాణ- కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాస, ఆటల పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏటుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుతో పాటూ బాలికలు క్రీడల్లో ప్రావిణ్యం సాధించాలన్నారు. కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయిలో ఉండాలని ఆకాక్షించారు. బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. బాలికలు కూడా బాలురులతో సమానంగా రాణిస్తు చదువుల్లో ముందంజలో ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటు భవిష్యత్తులో అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్యశ్రీ, గాయత్రి, ప్రకాష్, రవికుమార్, మహిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజ్‌గాం ఆలయ హుండీ ఆదాయం రూ. 42వేలు

నవతెలంగాణ- కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో బుధవారం షష్టిబోనాల సందర్భంగా హుండీలను లెక్కించారు. 27 ఫిబ్రవరి 2023 నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలను దేవాదాయశాఖ ఆదిలాబాద్ డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి పర్యవేక్షణలో దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు, విద్యార్థులు లెక్కింపులో పాల్గొన్నారు. మొత్తం రూ. 42,335 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వేణుగోపాలు, గంగాపూర్ ఆలయ ఈఓ బాపురెడ్డి, అర్చకులు ఇందారపు సంతోష్, అరుణోదయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికలు విద్యతో పాటు క్రీడారంగంలో సైతం రాణించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్త్రీ శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఆడపిల్లలను కాపాడుకోవాలని, ఆడపిల్లలను వద్దు అనుకుంటే రేపటి సమాజం అమ్మ లేని అనాథ అవుతుందన్నారు. బాలికలు, మహిళల సంక్షేమం కోసం బేటి బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అమలు చేయాలన్నారు. బాలికలు విద్యతో పాటు క్రీడారంగంలో సైతం రాణిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కస్తూర్బా బాలికల విద్యాలయం, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, బాలికలకు రక్షణ, స్వేచ్ఛ కల్పించడం కోసం ప్రభుత్వం అనేక రక్షణ చర్యలు చేపడుతుందన్నారు. ఏదైనా అనారోగ్యానికి గురైతే వెంటనే అవసరమైన పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలని, నేటి కోటి ప్రపంచంలో బాలికలు అన్ని విధాలుగా సన్నద్ధమై బాలురుతో సమానంగా రాణించాలన్నారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని వారం రోజులుగా కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, జీసీడీఓ శకుంతల, మహిళా సాధికారత కేంద్రం సభ్యులు శారద, మమత, ఝాన్సీ పాల్గొన్నారు.

వేటకు అమర్చిన తీగ తగిలి వ్యక్తి మృతి

- నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-కెరమెరి

అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఒకరి మృతి చెందిన సంఘటన మండలంలోని ధనోర కోలాంగూడ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వాంకిడి సీఐ శ్రీనివాస్ బుధవారం పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వివరాలను వెల్లడించారు. ధనోర కోలాంగూడకు చెందిన సిడాం కట్టి వేటకు అదేగ్రామానికి చెందిన భీముకు చెప్పడానికి వారి ఇంటికి వెళ్లాడు. భీము ఇంట్లో లేకపోవడంతో అతనిభార్య భీంబాయికి, రాత్రి వేటకు వెళ్దామని భర్తను రెడీగా ఉండమని చెప్పి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు సిడాం కట్టీ చెప్పిన ప్రాంతానికి వెళ్ళాడు. అక్కడ విద్యుత్ తీగ అమర్చి ఉన్నా విషయాన్ని భీము గమనించలేదు. అవి తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భీంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిడాం కట్టిను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పంట పొలాలు, అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమరిస్తే స్థానిక పోలీసులకు సమచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈసమావేశంలో ఎస్సై విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న వాంకిడి సీఐ శ్రీనివాస్

ప్రధాన రహదారిపై తారు వేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ బొర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై తారు వేయాలని వివిధ సంఘాల, ప్రతిపక్షాల నాయకులు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్ట్ నుండి ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వరకు ప్రధాన రహదారిపై బీటీ వేయాలన్నారు. అలాగే బైపాస్ రహదారి ఫ్లైఓవర్ నుండి ఆసిఫాబాద్ ఆంధ్రాబ్యాంక్ వరకు రోడ్డు వేసేలా సంబంధిత డిబిఎల్ అధికారులను ఆదేశించారని కోరారు. రహదారిపై రోడ్డు లేక ప్రస్తుతం ప్రధాన రహదారి మూసివేతకు గురి కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రహదారి ప్రారంభించి పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకుడు దుర్గం దినకర్, సీపీఐ నాయకుడు చిరంజీవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, బిఎంపి నాయకుడు రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారిక్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో పరిధిలో అందుబాటులోకి వచ్చిన లహరి, రాజధాని, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రస్తుతం అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపో పరిధిలోకి నూతనంగా వచ్చిన లహరి బస్సు పూర్తి ఏసి కోచ్‌గా ఉందని దీనిలో స్లీపర్ క్లాస్ సౌకర్యం కూడా ఉందని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం డిపో మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ డిపోకు రెండు లహరి బస్సులు, ఒక ఎక్స్ ప్రెస్ వచ్చిందని తెలిపారు. దీనిలో లహరి బస్సులను హైదరాబాద్‌కు నడిపించనున్నట్లు వివరించారు. నూతనంగా డిపోకు వచ్చిన లహరి బస్సు కు 33 సీట్లు కూర్చునే విధంగా 15 సీట్లు స్లీపర్ కోచ్ ఉంటాయని తెలిపారు. దీని బుకింగ్ కోసం స్లీపర్ కోచ్ ఒక్కొక్కరికి రూ.1240 ఉంటుందని సీటు బుకింగ్ కోసం రూ.850 రూపాయలు ఉంటుందని తెలిపారు. బస్సు సమయసారిని ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని వివరించారు. రెండు బస్సుల్లో ఒకటి కాగజ్‌నగర్ మీదుగా మరోటి నేరుగా హైదరాబాద్ నడపనున్నట్లు వివరించారు భవిష్యత్తులో ప్రయాణికుల నుండి ఏదైనా డిమాండ్ వస్తే దూరప్రాంతాలకు నడపడానికి ప్రణాళిక వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు శ్యామ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బిఆర్ఎస్ యువ నాయకుడు సాయినాథ్, నాయకులు సతీష్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపీ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కౌటాల

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కౌటాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని డబ్బా గ్రామంలో మేనేజర్ నరసింహస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులందరు తమతమ ఖాతాలకు ఫోన్ నెంబర్లను అనుసంధానం చేసుకోవాలన్నారు. అనుసంధానంతో ఖాతాల్లో జరిగే లావాదేవీలు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఖాతాల్లో ఎలాంటి మోసాలు జరిగే అవకాశముండదన్నారు. ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన, జీవనజ్యోతి భీమా యోజన పథకాల్లో చేరడం వల్ల భవిష్యత్తులో ఖాతాదారునికి మృత్యువు సంభవిస్తే మిగిలిన కుటుంటానికి ఆర్థికంగా ఆసరా కల్పించిన వారవుతారన్నారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా కళాజాత సభ్యులు మహేష్, వినోద్ ప్రదర్శన ద్వారా ఖాతాదారులకు సూచించారు. బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాహెరా బేగం, సీఎస్‌పీ లక్ష్మీనారాయణ, మహిళా సంఘాల వీఓ అధ్యక్షురాలు లావణ్య, మహిళా సంఘాల వీఓఏ మల్లయ్య, గ్రామ సచివాలయ కార్యదర్శి సురేష్, దామాజీ, మల్లేష్, సంతోష్, విజయ్‌కుమార్, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-బేల

కండరాల క్షీణత వ్యాధితో కాళ్లు చేతులు వంకరై ఎనిమిదేండ్లు మంచానికి పరిమితమైన బాలుడికి యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి చేయూతనందించారు. బేల మండలం దుబ్బగూడ(ఎం) గ్రామానికి చెందిన కొడప బీంరావ్ యశోద దంపతుల పెద్ద కుమారుడు రాజేష్ దయనీయస్థితిపై ఆయన బుధవారం స్పందించాడు. ఆ గ్రామాన్ని సందర్శించి బాలుడి పరిస్థితి పై ఆరా తీశారు. నెల రోజులకు సరిపడా రూ.7 వేల విలువైన కిరాణా సామాన్లు సొంత డబ్బులతో కొనుగోలు చేసి అందజేశారు. బాలుడికి సదరం సర్టిఫికెట్ ఇప్పించడంతో పాటు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా ఐటీడీఏ అధికారులతో మాట్లాడి వైద్యం చేయించేలా చూస్తామన్నారు. కడు దయనీయ పరిస్థితిలో ఉన్న వీరి కుటుంబానికి తమ ప్రభుత్వం హాయంలో ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఘన్‌శ్యామ్, ఎంపీటీసీ అరుణ్, యువజన కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ విపిన్, బోక్రే శంకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

టీడబ్ల్యూటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, టీడబ్ల్యూటీయూ కార్యదర్శి జాదవ్ శివాజీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు టీడబ్ల్యూటీయూ ముందుంటుందని పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణలో ఉపాధ్యాయులు ఆడే కైలాస్, రాథోడ్ పుష్పలత, రాథోడ్ చంపవతి, రాథోడ్ హరిచంద్, గంగాధర్, మల్కు, రవి, రజనీకాంత్, రాజ్యలక్ష్మి, ముక్తా, కల్పనా, పీడీ విశ్వనాథ్ ఉన్నారు.

నేడు ఓటరు అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఆదిలాబాద్‌లో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించడం జరుగుతోందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి గురువారం ఉదయం 10 గంటలకు ద్విచక్ర వాహన ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతుందన్నారు. ఈ ర్యాలీలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని యెందా గ్రామానికి చెందిన చవాన్ పకీర్‌చంద్ ఇటీవల మరణించారు. బుధవారం వారి పెద్దకర్మ కార్యక్రమానికి లంబాడా జేఏసీ నాయకులతో పాటు అట్టి టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో భారత్ చవాన్, నారాయణ చవాన్, వెంకటేష్ చవాన్, భాస్కర్, సంజు చవాన్, రాజు నాయక్, అనిల్ చవాన్, సుభాష్, సురేష్ ఉన్నారు.

నేతకానిలకు కార్పొరేషన్లలో ప్రాధాన్యత కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వంలో ఉండే వందకుపైగా కార్పొరేషన్లలో నేతకాని మహర్ కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని హైకోర్టు మాజీ ఏజీపీ రాజేష్ నేత అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు సమస్యలతో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులంలో ఉన్న నేతకానీలు రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం ఉంటుందన్నారు. ఆ కోణంలో అధిష్టానం ఆలోచించి, నేతకాని మహార్ కులస్తులకు కార్పొరేషన్లలో ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. దీనికి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. నేతకాని కులానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు సతీష్, మహేష్, సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా తామను తాము రక్షించుకోవాలో అనే దానిపై విద్యార్థినీ, విద్యార్థులకు డెమో చూపించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి నైతం శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రయ్య, కళాశాల అధ్యాపకులు కిరణ్‌కుమార్, సంతోష్, అశ్విని, రాజమౌళి పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లను గుర్తించాలి

● అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలోని వివిధ గ్రామ శివారుల్లో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేసిన వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి కోరారు. బుధవారం అదనపు కలెక్టర్ రాహుల్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా విచ్చల విడిగా వెంచర్లు ఏర్పాటు చేసి సామాన్యులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.



ఉద్యోగోన్నతి పత్రాలు అందజేసిన పీఓ

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులకు ఎస్ఎల్పీ(సర్వీస్ లింక్డ్ ప్రమోషన్) ఉద్యోగోన్నతి పత్రాలను ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తం రెడ్డి అందజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్రాలను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సేఫ్టీతో కూడిన ఉత్పత్తి సాధించాలని, తాను చేస్తున్న పనులలో నైపుణ్యాన్ని కనబర్చి ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఎస్ఆర్పీ ఓసీ ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య, అధికారుల సంఘం ప్రతినిధి శ్యామ్ సుందర్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలి



నవతెలంగాణ-తాండూర్

ఇంటి పన్నులు సకాలంలో వసూళు చేయాలని బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్ రావు ఆదేశించారు. బుధవారం మొబైల్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా రేచీని గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రిజిస్టర్లు, పారిశుద్ధ్యం, నర్సరీ పనులను పర్యవేక్షించారు. మొక్కల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామపంచాయతీలో ప్రతిరోజు తడిపొడి చెత్త వేరుగా సేకరించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు .

సొంత భవనాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని ఇందన్‌పల్లి, కవ్వాల్, జన్నారం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఇందన్‌పల్లి జీపీ భవనానికి రూ.13లక్షలు, కవ్వాల్ జీపీ భవనానికి రూ.20లక్షలు, జన్నారం జీపీ భవనానికి రూ.20లక్షల చొప్పున వెచ్చించి నూతన భవనాలను నిర్మించామన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఆయన సూచించారు. పంచాయతీలకు ప్రత్యేక నిధులిస్తూ మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందన్‌పల్లి, కవ్వాల్, జన్నారం సర్పంచులు కంటెం సునీత శంకర్, అసలీ బాయ్ కలిరాం, భూషణవేణి గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీలు సాగే శ్రావణి, సౌజన్య, మహమ్మద్ రియాజుద్దీన్ ఉప సర్పంచ్ జంగం రవి, మహమ్మద్ అజారుద్దీన్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసిఉల్లా, బీరవేణి రాజన్న, గంగన్న, లకావత్ తిరుపతి, దాముఖ కరుణాకర్, పాత బాలరాజు, అజ్మత్‌ఖాన్, ఎన్ఎస్‌సీఐ రాష్ట్ర నాయకులు సోహెల్‌షా, ఇసాక్ మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, నందు నాయక్ ఏపీఆర్, ఆయా గ్రామాల వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలి



నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ పనుల విరామంలో ఎండాకాలం దృశ్య మండలంలోని నైపుణ్యత లేని కూలీలందరికీ ఉపాధి హామీ ద్వారా పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలకు సగటు వేతనం వచ్చేలా పనులు నిర్వహించాలన్నారు. వ్యవసాయ అభివృద్ధి, పర్యావరణ సమతుల్యతకు సంబంధించిన పనులను ఎంపిక చేయాలని సూచించారు. భూగర్భ జలాల నిల్వ కోసం గ్రామాల్లో విరివిగా నీటి నిలువ కుంటలు ఏర్పాటు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. గ్రామ పంచయతీ నర్సరీల్లో మొలకలు రాని సంచులలో మరల విత్తనాలు నాటి, కలుపు తొలగించాలన్నారు. ఉపాధి హామీ కూలీల వేతన చెల్లింపుల్లో జాప్యం జరగకుండా బ్యాంక్ ఖాతాలను ఆధార్ కార్డ్‌కు అనుసంధానం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఏపీఓ నంద కుమార్, టీఏ రమేష్, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-నస్పూర్

రగ్బీ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించాలని రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ ఆకాంక్షించారు. బుధవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్‌కు రూ.15 వేల విలువ చేసే రగ్బీ బాల్స్(కిట్స్) అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రగ్బీ క్రీడకు మంచి ఆధరణ లభిస్తుందని, ఈ క్రీడాతో పోరాట పటిమ కలిగిస్తుందన్నారు. రగ్బీ క్రీడను అన్ని మండలాల్లో విస్తిరింపచేసి రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడాకారులు పాల్గొనే విధంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్పుల ప్రవీణ్, ఆవునూరి సురేష్, రాజలింగు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయిలో నిలవాలి

● మంచిర్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

నవతెలంగాణ-నస్పూర్

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ ఆదర్శంగా నిలువాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాహుల్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలను రక్షిద్దాం - బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో ఆకాశాన్ని అందుకుంటారన్నారు. బ్రూణహత్యల నివారణ, బాల్యవివాహాల నియంత్రణ చర్యల ద్వారా బాలికలను రక్షించుకొని అణిచివేతకు గురి కాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. బాలికలకు జీవించే హక్కు రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు, భాగస్వామ్య హక్కు లాంటి ఎన్నో హక్కులున్నాయని తెలిపారు. చదువులో బాలుర కంటే బాలికలు చక్కగా రాణిస్తున్నారని, బాలికల రక్షణ కొరకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్ళాలని అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా బాలిక విద్యను అందించడంతో పాటు మానసికంగా ధృడంగా ఉండటంతో పాటు శారరీకంగా బలంగా ఉండేందుకు ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలలో "వాల్యూ ఆఫ్ గర్ల్ చైల్డ్" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, బాలల పరిరక్షణ సమితి చైర్మెన్ వాహిద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మెన్‌గా నోవహూ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్‌గా కనుమండ్ల నోవహూను నియమించినట్లు రాష్ట్ర చైర్మెన్ జిలుకర రవి కుమార్ తెలిపారు. మంచిర్యాలలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జేఏసీలతో కలిసి క్రిస్టియన్ జేఏసీ బలమైన పాత్ర పోశించిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమంలో పాల్గొన్న క్రిస్టియన్ జేఏసీ, క్రైస్తవులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మెన్ నోవహూ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రైస్తవులందరికీ మేలు జరుగుతుందన్నారు. తనను చైర్మెన్‌గా నియమించినందుకు రాష్ట్ర చైర్మెన్, సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర కో చైర్మెన్ మేకల సారయ్య, రాష్ట్ర నాయకులు చెరుకూరి రత్నరాజు, మేదరి పాల్‌సన్, హనోక్ పాల్గొన్నారు.

అంజనీపుత్ర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

అంజనీపుత్ర సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను చైర్మెన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరికీ శుభం జరగాలని, ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా అంజనీపుత్ర సంస్థ గుర్తింపు సాధించడం సంతోష దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు ఎస్ కిషన్, జీ. సంతోష్ పాల్గొన్నారు.

అవకాశాలతో భవిష్యత్ లక్ష్యాలను సాధించాలి

● మహిళా తరంగిణి సొసైటీ అధ్యక్షురాలు శ్రీదేవి



విద్యార్థులకు సైకిళ్లను అందిస్తున్న మహిళ తరంగిణి సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-జైపూర్

విద్యారంగంలో అందివచ్చిన అవకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ భవిష్యత్ లక్ష్యాలను సాధించుకోవాలని మహిళా తరంగిణీ సొసైటీ అధ్యక్షురాలు శ్రీదేవి సూచించారు. మండల పరిధి ముదిగుంట గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం తమ సొసైటీ ద్వార దూర ప్రాంత ముగ్గురు విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. మమత మహిళా తరంగిణి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని పాఠశాల విద్యార్థులతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ బాలికలు విద్యార్థులుగా తమ అమూల్యమైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవడం ద్వార ఆశించిన ఫలితాలను పొందవచ్చని తెలిపారు. ఈ సంధర్భంగా గిన్నీస్ బుక్ రికార్డు గ్రహిత డా.చిదానంద కుమారి తమ వంతుగా కానుకూరు, మిట్టపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థినులకు సైకిళ్లు ఉచితంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతుగా సహాయ సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభకు పదును పెట్టాల్సిన అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, మమత సొసైటీ కార్యదర్శి పద్మ, కోశాధికారి జ్యోత్స్న, సభ్యులు నాగమణి, గ్రామ సర్పంచ్ దూగుట జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునికి ప్రశంస

నవతెలంగాణ-కాసిపేట

డోర్ టూ డోర్ క్యాంపెనింగ్‌లో భాగంగా జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినా వ్యక్తులకు హైదరాబాద్ గాంధీ భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్‌కు ప్రశంస పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి సురభి చేతుల మీదుగా ఆయన ప్రశంస పత్రం అందుకున్నారు. మంచిర్యాల జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినా బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాకేష్, బెల్లంపల్లి యూత్ ప్రధాన కార్యదర్శి అభిలాష్, పట్టణ అధ్యక్షుడు శ్రవణ్ ప్రశంస పత్రాలు పొందారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న హర్షణీయం

నవతెలంగాణ-జన్నారం

బీహార్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కర్పూరి ఠాగూర్‌కు కేంద్రం భరత రత్న ఇవ్వడం హర్షనీయమని నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. నరేందర్, శేఖర్ నాయి, బీసీ కులాల ఐక్య ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్పూరి ఠాకూర్ సేవలకు గాను భారత రత్న ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

● హాజరుకాని ప్రతిపక్ష సభ్యులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డం శ్రీనివాస్

నవతెలంగాణ-దండేపల్లి

మండల సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశం సర్పంచ్ సభ్యులకు ఆఖరి సమావేశం కాగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు లేక సమావేశం సాగింది. అధికారులు సైతం హాజరు కాకపోవడంతో సభ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించే సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలన్నారు. ఇందులో ఎవరు లేకపోయినా ప్రజా సమస్యలు పరిష్కారం కావని అసహనం వ్యక్తం చేశారు. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టి సంవత్సరాలు గడుస్తున్న లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయకుండా, తిరిగి డబ్బులు చెల్లించలేదని అధికార పార్టీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్ణపేట సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస వసతులు లేవని కుక్క కరిచిన మందులు ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో కోతులు, కుక్కల సంచరం పెరింగి జనాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని వైద్యాధికారులు సైతం సకాలంలో రావడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీఓ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మహిళా గ్రూపు సభ్యుల వీఓ కార్యాలయాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల గ్రూప్ సభ్యులు తమ సమావేశాన్ని నిర్వహణకు భవనం ఉపయోపడుతుందన్నారు. అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్‌ను వీఓ గ్రూప్ సభ్యులు, గ్రామ మహిళలు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బుచ్చన్న, సీసీ దుర్గం శ్రీనివాస్, కార్యదర్శి లావణ్య వార్డు సభ్యులు చంద్రయ్య రాజన్న, జునుగురు లక్ష్మి, జాడి వెంకట్, వీఓ తిమ్మాపూర్ లీడర్ లలిత పాల్గొన్నారు.

ఉత్తమ సింగరేణి ఉద్యోగుల ఎంపిక

నవతెలంగాణ-మందమర్రి

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి ఏరియా నుండి 12 మంది ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైనట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ ఉద్యోగితో పాటు అధికారిగా జే నాగరాజు ఏజీఎం(ఈఅండ్ఎం)జీఎం కార్యాలయ ఉద్యోగి, ఉత్తమ సింగరేణియన్‌గా కుమ్మరి జెస్సిరాజ్ కెకె 5 జనరల్ మజ్దూర్ కొత్తగూడెం ఏరియా ప్రకాశం స్టేడియంలో నిర్వహించే గణతంత్ర వేడుకలలో సంస్థ సిఅండ్ఎండీ బలరాం చేతుల మీదుగా బహుమతులు అందుకుంటారని తెలిపారు. 12 మంది ఉద్యోగులకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ చేతుల మీదుగా సన్మానం ఉంటుందన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకోని పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాఘవేంద్ర రావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం హైస్కూల్ గ్రౌండ్ నుండి ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉత్కూర్ చౌరస్తాలో మానవహారం చేపట్టి ఓటరు ప్రతిజ్ఞ చేయించి ముగిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

గణతంత్ర దినోత్సవ పనుల పరిశీలన

నవతెలంగాణ-మందమర్రి

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సింగరేణి పాఠశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ జనవరి 26న జరిగే పతాకావిష్కరణ, గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే ఉద్యోగుల కుటుంబాలు, వివిధ పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీవైపీఎం ఎండీ ఆసిఫ్, సివిల్ డీవైఎస్ఈ ఎం.జయప్రకాష్, డీవై మేనేజర్ ఫారెస్ట్రీ ఆర్.వెంకట రమణారెడ్డి, ఈఅండ్ఎంఎస్ఈ ఎం.నాగరాజు నాయక్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జైనథ్

రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధరను బీజేపీ ప్రభుత్వం మాత్రమే అందించిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులను ఆదుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర



కూడా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తుందని అన్నారు. మార్కెట్‌లో కందుల ధరలు అధికంగా ఉండటంతో దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలను ప్రారంభించిందని తెలిపారు. రైతులు నష్టాల బారిన పడకుండా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బుధవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్జి బి.హుస్సేన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్యారమ్ బోర్డ్, చెస్, పోటీలను నిర్వహించారు. పోటీలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావ్ దేశ్‌పాండే, సెక్రటరీ పంద్రం శంకర్, పీపీ శ్రీధర్, క్రీడా, సంస్కృతిక కార్యదర్శి కుమ్మరి విజయ్ కుమార్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావ్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, దమ్మాపాల్, జమీర్, కోర్టు సూపరింటెండెంట్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానించిన ఓయూ విద్యార్థులు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉద్యమ నాయకుడు మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఓయూ జేఏజీ, తెలంగాణ జేఏసీ విద్యార్థి ఉద్యమ నాయకుల ఆధ్వర్యంలో వివేక్ వెంకటస్వామిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ, తెలంగాణ జేఏసీ నాయకులు తలమల్ల శ్వేత, సురేష్ యాదవ్, శ్రీనివాస్, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల, ఓయూ కళాశాల ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి బలవన్మరణం

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైకం కీర్తన(19) అనే యువతి పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. చదువుకోకుండా ఎక్కువ సమయం ఫోన్‌లో గడుపుతున్నందుకు బాలిక తండ్రి ఆమెను మందలించాడని పోలీసులు తెలిపారు. దీంతో ఆ అమ్మాయి క్షణికావేశంలో ఇంట్లో తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లడంతో పురుగులమందు తాగి వాంతులు చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు విషయం అడగగా పురుగులమందు తాగినట్టు చెప్పింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలించారు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మరణించిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

దుబ్బగూడెంలో సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-కాసిపేట

గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండ రెవెన్యూ, సింగరేణి అధికారులు సర్వేలు నిర్వహించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామస్తులు సర్వేను అడ్డుకున్నారు. కెకె ఓసీపీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడెంలో అధికారులు ఇంటిస్థలాలు కాకుండ అదనంగా ఉన్న భూములను సర్వే చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండ తమ భూములు ఎలా చూపిస్తామని, ఇప్పటికే ఒక్కరి భూమి ఒక్కరు రాయించుకోని డబ్బులు తీసుకున్నారని, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరిద్దరి కనుసన్నల్లో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తు సామన్యులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సర్వేను నిలిపివేస్తున్నామని రేపటి నుంచి సర్వే చేస్తామని అందరు సిద్ధంగా ఉండాల్సిందిగా తెలిపి అధికారులు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ సులోచన, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

పట్టణ బంద్ పాక్షికం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన సమితి ఇచ్చిన పట్టణబంద్ పాక్షికంగా జరిగింది. బుధవారం ఆయా దుకాణాల వారు స్వచ్ఛందంగా మూసివేశారు. ఉదయం సాధన సమితి సభ్యులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడక్కడ తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన సమితి చైర్మెన్ నారాయణ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం పట్టణంలో అనేక పరిశ్రమలుండేవన్నారు. దాదాపు ఐదు వేల మంది వలస వచ్చి జీవనోపాధి పొందేవారని తెలిపారు. సరైన రవాణ మార్గం లేక నేడు పరిశ్రమలు ఆక్సిజన్‌పై ఉన్నాయన్నారు. ఆదిలాబాద్ ఆర్థికంగా స్థిరపడాలంటే ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు కూడా మద్దతు తెలిపాలని కోరారు. రైల్వేలైన్ వచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు లంకరాఘవులు, శోభతాయి తుల్జాపూరే, ఎండీ రఫీక్, గోడం గణేష్ పాల్గొన్నారు.

నేడు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ గంగాచరణ్, సీఈఓ క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న ఆయా గ్రామాల రైతులు గురువారం నుంచి కొనుగోలు కేంద్రాలలో కందులు తీసుకువచ్చి అమ్ముకోవాలని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరువుతునట్టు తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కందులను తీసుకువచ్చి, మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు కందులను తీసుకువచ్చేటపుడు తప్పనిసరిగా ఆధార్ కార్డ్ పట్టా పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ వెంట తీసుకురావాలని కోరారు.

సమస్యల వలయంలో సల్పాల్‌గూడ

- ఏకోపాధ్యాయుడితో అందని విద్య
- జన్‌మన్‌తోనైన అభివృద్ధి చెందేనా..?
- ఇప్పటికీ గ్రామానికి రాని అధికారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని సల్పాల్‌గూడ గ్రామం సమస్యల వలయంలో ఉంది. గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాని కారణంగా కోలాం తెగకు చెందిన సల్పాల్‌గూడలో ఎక్కడ చూసిన సమస్యలే. ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని సల్పాల్‌గూడ గిరిజన కోలాం గూడ. ఇక్కడ మడావి వంశానికి చెందిన దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే గ్రామంలో నేటికి రోడ్డు, మురికి కాలువలు, వీధి దీపాలు తదితర సమస్యలతో గిరిజనం ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గ్రామంలో ఐటీడీఏ ద్వారా మూడవ తరగతి వరకు బోధించేలా ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి ఒక ఉపాధ్యాయుడిని నియామించారు. ఆయన కూడా సక్రమంగా రాక విద్య అందడం లేదు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు గ్రామానికి సమస్యలు తెలుసుకుంటు వాటి పరిష్కారం కోసం హామీ ఇస్తునే వస్తునారే తప్ప చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అదే పక్కనే ఉన్న చిన్న సల్పాల్ గూడలో ఇదే పరిస్థితి ఉంది. ఈ గూడలో దాదాపు 15 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గిరిజనులు కాబట్టే తమను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సాగు నీరు అందితే మూడు పంటలు..

మండలంలోని ఆయా గిరిజన గ్రామాలు, గూడెలకు వనరులున్న వాటిని వినియోగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సల్పాల్ గూడ పరిధిలో వందల ఎకరాల్లో సాగు జరుగుతుంది. సాగు నీరు లేని కారణంగా వర్ష ఆధారిత పంటలైన పత్తి, కందులు, సోయ, జొన్న వాటినే మాత్రమే సాగు చేస్తున్నారు. మిగిత సమయంలో ఆ పంట భూములు ఖాళీగానే ఉంటున్నాయి. దీని కారణంగా ఆదివాసీ రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. సాత్నాల ప్రాజెక్టు నుంచి నూతన కెనల్‌ను నిర్మించి నీటిని మళ్లిస్తే మూడు పంటలు తీసేందుకు అస్కారం ఉంటుంది. పంటల మార్పిడి చేయాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికి దానికి అనుగుణంగా సాగు నీటిని అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు.

జన్‌మన్‌తోనై సమస్యలు తీరేనా..!

ఆదిమ గిరిజన తెగల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌మన్ యోజన పథకం ప్రవేశపెట్టింది. ఇందులో ఆదిమ గిరిజన తెగల గ్రామాల అభివృద్ధికి సంబంధించి 12 అంశాలను తీసుకుంది. ఇందులో మౌళిక వసతులు కల్పించమే ఈ పథకం లక్ష్యం. అయితే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌళిక వసతులపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాలను గుర్తిస్తారు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు అభివృద్ధి నోచుకోని సల్పాల్‌గూడ, చిన్న సల్పాల్‌గూడకు ఈ పథకం కింద లబ్ది చేకూరుతోందో లేదో. ఇప్పటి వరకు గ్రామానికి అధికారులు వచ్చి పరిశీలించిన దాఖలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పథకం లక్ష్య సాధనలో తమ గ్రామంలోని సమస్యలు తీరుతాయో లేక హామీలకే పరిమితం అవుతాయో అర్థం కావడం లేదని గిరిజనులు అయోమం చెందుతున్నారు.

సాగు నీరందించాలి




మడావి లస్మన్న, గ్రామపటేల్, సల్పాల్‌గూడ

పంటలు సాగు చేసుకొని జీవించే తమకు సాగు నీరిందించాలి. పక్కనే సాత్నాల ప్రాజెక్టు ఉంది. అక్కడి నుంచి నూతన కెనల్‌ను నిర్మించి నీటి మళ్లిస్తే మూడు పంటలు తీయవచ్చు. అదే విధంగా గ్రామంలో మౌళిక వసతులతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలి.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- నిర్మల్ కలెక్టర్ అశీష్ సంగ్వాన్



నవతెలంగాణ- నిర్మల్

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ అశీష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నిర్మల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఐకేపీ సహాయ సహకారాలతో నూతన కలెక్టరేట్ భవనంలో మెగా రుణ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ మహిళా సంఘాలకు రుణాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాలలో అతి తక్కువ మొండి బకాయిలు, అతి ఎక్కువ లింకేజీలతో నిర్మల్ జిల్లా అగ్రస్థానంలో ఉందని తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంబించడంతో ఉన్న ఉపయోగాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆక్వా బిజినెస్, దేశీ పౌల్ట్రీ, డైరీ మిల్క్, ట్రాకింగ్ పరిశ్రమ, కల్తీ లేని ఉత్పత్తి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్‌పర్సన్ శోభ మాట్లాడుతూ ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్తగా మారాలని ప్రతి మహిళ బ్యాంక్ ద్వారా లబ్ధి పొందుతూ పుష్కలంగా ఉన్నటువంటి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 30 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారని అలాగే 30శాతం రుణాలు కూడా అందించామని తెలిపారు. టీజీబీ ఆర్‌ఎం రామారావు మాట్లాడుతూ

సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్‌ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. సంవత్సరానికి రూ.1,456తో రూ.24 లక్షల ఇన్సూరెన్స్ పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 31 శాఖల ద్వారా నిర్మల్ జిల్లా మహిళలకు తాము రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. మహిళలు వాటిని సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధిలోకి రావడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అనంతరం ఐకేపీ మహిళలకు రూ.50కోట్ల చెక్కును అందించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, టీజీబీ బ్రాంచి మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఐకేపీ ఏపీడీ గోవిందరావు, డీపీఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించే వరకూ ఉద్యమం

నవతెలంగాణ-బోథ్

రాజ్యాంగ బద్ధంగా లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సామాజిక ఉద్యమంలో సిరికొండ మండల పోలీస్ స్టేషన్‌లో మాపై వేసిన కేసులతో భయపడేది లేదని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా రాజకీయ పోరాటంతో లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు వెనుకడుగు వేయమని అన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ అమృత్‌రావ్, పెందూర్ అనిల్, పెందుర్ బాగవంత్‌రావ్, కొట్నాక్ పాండు, కుమ్రం భీమ్, కుమ్రం యాదవ్ రావ్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో కొత్తగా ఏర్పాటు కాబోతున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపాదికన ఎంపిక కోసం ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్ కం సెంటర్ కోఆర్డినేటర్ ఒకటి, సపోర్టు పర్సన్స్ రెండు, రిసెప్షనిస్టు ఒకటి, ఎఎన్‌ఎం ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు పూర్తి సమాచారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీ సెక్షన్19 ఎస్సై హాకీం 8712566264 నెంబరును సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ- నిర్మల్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అశీష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆట, పాటలతో పాటు చదువులోనూ రాణించాలని తెలిపారు. అనంతరం పలువురికి బహుమతులు అందించారు. ఎనిమిది మందికి స్కూటీలు అందించారు. డీడబ్ల్యూఓ వైవీ.రమేష్, సీడీపీఓ నాగమణి, స్వాతి, మూర్తి, మధుసూదన్‌రెడ్డి, సగ్గాం రాజు, అంగన్వాడీ సిబ్బంది, దివ్యాంగుల వ్యవస్థాపక అధ్యక్షులు సట్టి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ సౌకర్యాలు మెరుగుపర్చేలా చర్యలు

- నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

గత ప్రభుత్వం తన పదేండ్ల పాలనలో ఆర్టీసీని కుదేలు చేసిందని, నూతన తమ ప్రభుత్వం ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరిచేలా బస్సుల సంఖ్యను పెంచిందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం రాత్రి బస్టాండ్‌లో నాలుగు లహరి ఏసీ స్లీపర్, రెండు నాన్ ఏసీ బస్సులను ఎమ్మెల్యేలు పాయల శంకర్, వెడ్మ బొజ్జులతో కలిసి ప్రారంభించారు. ముందుగా బస్సులకు పూజలు చేసి అందులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టీసీ కార్మికులు, యూనియన్ల నాయకులు ఆమెకు పలు సమస్యలను విన్నవిస్తూ దరఖాస్తులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీ అంత కుదేలు చేయడం, నెలల తరబడి కార్మికులు దర్నాలు, సమ్మెలు చేశారన్నారు. ఆర్టీసీని బలోపేతం చేస్తు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేలా నూతనంగా బస్సుల సంఖ్యను పెంచేలా సీఎం రేవంత్, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు బస్సుల సంఖ్య, ఆర్టీసీ ఉద్యోగుల భద్రత లాంటివి కల్పించామని గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు 16 సిట్టింగ్, స్లీపింగ్ బస్సులను కేటాయించి ప్రారంభించడం జరిగిందన్నారు. రాజకీయ విబేదాలు లేకుండా జోడెద్దుల పని చేసి వెనుబడిన ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో తీసుకెళ్తామని అన్నారు.

గత ప్రభుత్వ విధానాల వల్లే ఆర్టీసీ నిర్వీర్యం..

గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసేలా వ్యవహరించిందని, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీలో స్లీపర్ కోచ్ ఏర్పాటు చేయడంతో దూర ప్రయాణికులకు సౌకర్యాలు ఏర్పాడుతాయని అన్నారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అంతే కాకుండా గత ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఎయిర్‌పోర్టుకు సంబంధించిన ఎన్‌ఓసీ త్వరగా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఆర్‌ఎం సోలోమాన్, డిప్యూటి ఆర్‌ఎం ప్రవీణ్, డీఎం కల్పన, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్


మండల కేంద్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ఖాందేవుని జాతరను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ అన్నారు. బుధవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, జాదవ్ అనిల్‌తో కలిసి జాతర పోస్టర్లు విడుదల చేశారు. ఇందులో ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, తొడసం వంశీయులు ఉన్నారు.

నేటితో జాతర ప్రారంభం...

పుష్యమాసంలో ప్రారంభంతోనే తొడసం వంశస్థుల ఆరాధ్య దైవం ఖాందేవునికి ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం.. తొడసం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభిస్తారు. ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. జాతరలో వచ్చే వారికి ఇబ్బంది లేకుండా వారి కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తొడసం నాగోరావ్ తెలిపారు.



గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వాటర్స్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం ఎస్పీ గౌస్‌ఆలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలైన సందర్భంగా నిర్వహించుకునే పెద్ద పండుగ అని అన్నారు. 2024 సంవత్సరం జిల్లాలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ 6 ప్లాటూన్‌లతో ఉన్నతో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్ సారథ్యంలో అద్భుతంగా స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది, హోమ్ గార్డ్స్, ఎన్‌సీసీ విద్యార్థులతో పరేడ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముఖ్య అతిథులకు వేదికను అత్యంత సుందరంగా అలంకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు, అతిథులు, సిబ్బంది, స్టాల్స్, శకటాలు ఏర్పాటుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హెడ్ క్వార్టర్స్ ముఖ ద్వారం నుంచి మైదానం వరకు ఇరువైపులా రంగురంగుల జెండాలతో ముస్తాబు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్, మురళి, కార్తీక్ సిబ్బంది పాల్గొన్నారు.